అజ్నీ హాల్టింగ్ లేకపోవడంపై అసంతృప్తి

ఓదెల, మార్చి 6: కరోనా కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో నడిచే అజ్నీ రైలును సమయంలో రద్దు చేయగా, ఇటీవల ప్రజల విజ్ఞప్తి మేరకు గురువారం నుంచి పునరుద్ధరించారు. అయితే రైలుకు పలు స్టేషన్‌లలో హాల్టింగ్‌లను ఎత్తివేశారు. దీంతో ఈ రైలు పునరుద్ధరించిన గ్రామీణ పేద ప్రజలకు ఉపయోగపడకుండా పోతున్నది. కరోనా సమయంలో అనేక రైళ్లను రైల్వే శాఖ ఎక్స్‌ప్రెస్‌గా మార్చు చేసి పరిమిత స్టేషన్లలో హాల్టింగ్ ఇచ్చింది. అందులో భాగంగా 17035–17036 అజ్నీ ప్యాసింజర్ రైలును కూడా ఎక్స్‌ప్రెస్‌గా చేసి కొన్ని రోజులు నడిపారు. అయితే ఆ రైలును రద్దు చేసిన సమయంలో అప్పుడున్న ఉన్న స్టేషన్ల హాల్టింగ్‌లతో నడపనున్నారు. ఈ కారణంగా ఆ రైలును పునరుద్ధరించిన గ్రామీణ ప్రజలకు ఉపయోగపడడం లేదు. ఈ రైలు మొదట్లో నాగపూర్ ప్యాసింజర్ (నిరక్షరాస్యులు మనుషుల బండి, గరిబోళ్ల బండిగా పిలుచుకునే వారు). 60ఏళ్ల క్రితం ఎక్కువగా గూడ్స్ రైళ్లే నడిచేవి, ఈ ఒక్క రైలే ప్రయాణికుల కోసం ఉండేది కాబట్టి దీనికి మనుషుల బండి అని పిలిచేవారు. ఈ రైలు కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో ప్రతి స్టేషన్‌లో ఆగేది. అందుకే దీనిని గ్రామీణ ప్రజలు మనుషుల బండిగా పిలిచే వారు. కాగా ఇప్పుడు నడుస్తున్న రైళ్లను కొన్ని స్టేషన్లకు పరిమితి చేయడంతో చిన్న, చిన్న స్టేషన్లలో ఏ రైలు కూడా ఆగక అలంకారప్రాయంగా ఉంటున్నాయి. ఈ ఒక్క రైలే ప్రతి స్టేషన్‌లో ఆగడం వల్ల పేదలకు ఎక్కువగా ఉపయోగం ఉండేది. అజ్నీ ప్యాసింజర్ రైలు దాదాపుగా 60 ఏళ్లు ఈ ప్రాంత ప్రజలకు సేవలందించింది. మహారాష్ట్రలోని బల్లార్షా, నాగపూర్ పట్టణాలకు ఈ రైలులో వెళ్లి వివిధ చిన్న, చిన్న వ్యాపార పనులు చేసుకునేవారు. కూలీ పనులకు వెళ్లే వారు, విస్తరాకుల కట్టలు,పాలు, కూరగాయలు, చీపురు కట్టలు, రైతులు పండించిన మిర్చి, వైద్యం కోసం, ఇతర పేదల అవసరాలకు ఈ రైలు సేవలందించింది. ఈ రైలు రద్దుతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైలు పునరుద్ధరించాలని ప్రజల నుంచి డిమాండ్ పెరగడంతో గురువారం నుంచి పునరుద్ధరించారు. అయితే ఇది పేదలకు ఉపయోగపడకుండా కేవలం పట్టణాలకు హాల్టింగ్‌లు పరిమితం కావడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రైలు హాల్టింగ్‌లపై పునరాలోచించాలని కోరుతున్నారు. లేపోతే ఈ రైలు పునరుద్ధరించినా ఫలితం లేకుండా పోనున్నది. అనేక గ్రామాల ప్రజలకు కొలనూర్, పొత్కపల్లి స్టేషన్‌లు అనువుగా ఉండి రైల్వే సౌకర్యాన్ని పొందుతున్నారు. ఆయా స్టేషన్లలో అజ్నీ రైలు హాల్టింగ్ జరిగేలా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కృషి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకర్ నీళ్లు పట్టుకుంటున్న గంగాపురి వాసులు

గంగాపురిలో తాగునీటి ఎద్దడి

మంథని, మార్చి 6: మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురిలో తాగునీటి ఎద్దడి మొదలైంది. ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వారం నుంచి గంగాపురికి మిషన్ భగీరథ నీళ్లు నిలిచి పోవడంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటల వచ్చే మిషన్ భగీరథ నీళ్లు ఇప్పుడు మొత్తానికే రావడం లేదంటూ గంగాపురి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డు ప్రజలకు ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్ ద్వారా మున్సిపల్ అధికారులు నీళ్లను సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీళ్లు క్రమం తప్పకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నీటి సరఫరా నిలిచి పోవడంపై మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ను వివరణ కోరేందుకు నమస్తే తెలంగాణ ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

క్యాన్సర్ పేషెంట్‌కు వాట్సప్ మిత్రుల అండ

క్యాన్సర్ బాధితుడు చంద్రశేఖర్‌తో మిత్ర బృందం

కోల్‌సిటీ, మార్చి 6: గోదావరిఖని విఠల్ నగర్‌కు చెందిన చిలుక చంద్రశేఖర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. మేమున్నామనీ... నీకేం కాదంటూ వాట్సప్ మిత్రులు ధైర్యం చెప్పారు. విరాళాలుగా సేకరించిన రూ.1.20 లక్షలను గురువారం అతనికి అందజేసి ఔదార్యం చాటుకున్నారు. గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న చంద్రశేఖర్ పరిస్థితిని అతని మిత్రుడు ఏఆర్ కానిస్టేబుల్ పిడుగు సతీశ్ వివిధ వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ చేశాడు. బాధితుకి అండగా నిలుద్దామని అర్థించాడు. స్పందించిన పలువురు మిత్రులు తోచినంతగా సాయం అందించారు. అలా విరాళాలుగా పోగు చేసిన రూ.1,20,428 లను గురువారం మిత్రులం తా కలిసి అతని ఇంటికి వెళ్లి అందజేశారు. చంద్రశేఖర్‌కు మానసికంగా ధైర్యం చెప్పారు. అతని ఆరోగ్యం కుదుట పడటానికి వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు ఇంకెవరైనా ఉంటే ముందు వచ్చి అతని గూగుల్ పే నం.86390 66616కు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మిత్ర బృందం , పిడుగు రాజు, కటుకు ప్రవీణ్‌కుమార్, సాగం టి రాజేందర్, తిరుపతి, అనిల్, రమేష్, అశోక్, శేఖర్, నరేశ్, అంజిబాబు, మెండె సంపత్, కనకరాజు, జితేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడుగు సతీశ్‌ను పలువురు అభినందించారు.

విరాళం అందజేస్తున్న రఘువీర్ సింగ్

ఆలయాభివృద్ధికి విరాళం

జూలపల్లి, మార్చి6 : మండల కేంద్రంలోని శ్రీ రావుల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ 'నేనున్నా' స్వచ్ఛంద సేవా సంస్థ తరపున యాదవ సంఘం నాయకులకు గురు వారం రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని తనవంతుగా ఆలయాల అభివృద్ధికి తోడ్పడుతున్నానని తెలిపారు. నాయకులు కొంజర్ల వెంకటయ్య, మేకల మల్లేశం, గంట రాములు, మారం తిరుపతి, కొమ్మ ఐలయ్య, మెండె రాజయ్య, మల్లెత్తుల అంజి, బొప్పెనపల్లి చంద్రయ్య, పొలగాని సతీశ్ పాల్గొన్నారు.

ఆర్జీ–2లో క్వార్టర్స్‌కౌన్సిలింగ్

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 6 : సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఏరియాలో గురువారం సీఈఆర్ క్లబ్‌లో క్వార్టర్స్ పొందని ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం సంతోష్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఆర్జీ–2 ఏరియా, జీడీకే 11 ఇంక్లైన్, ఓసీపీ–1 ఉద్యోగులకు క్వార్టర్ మార్పిడి, క్వార్టర్ లేని వారికి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. 565 క్వార్టర్లకుగాను 233 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా కౌన్సిలింగ్‌కు 127మంది హాజరయ్యారు. 108 మంది ఉద్యోగులు క్వార్టర్లను తీసుకున్నారని తెలిపారు. ఈ కౌన్సిలింగులో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి జీగురు రవీందర్, డీజీఎం(ప) అనిల్ కుమార్, సివిల్ ఈఈ ప్రతాపగిరి రాజు, డీవైపీఎం వేణుగోపాల్, క్వార్టర్స్ సెక్షన్ ఇంచార్జీ మమత, జయ, క్రీడల సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి స్కూల్ బస్సు రాక పాట్లు

బస్సు రాకపోవడంతో స్కూల్ వద్ద ఉన్న విద్యార్థులు

రాత్రి బస్సు రావడంతో వెళ్తున్న విద్యార్థులు

ముత్తారం, మార్చి 6: సమయానికి బస్సు రాకపోవడంతో దర్యాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు చీకటి పడ్డాక కూడా పాఠశాల ఆవరణలోనే ఉండాల్సి వచ్చింది. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే దర్యాపూర్‌లోని మోడల్ స్కూల్‌కు ముత్తారంతో పాటు మంథని, రామగిరి మండలాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. వీరి కోసం మంథని డిపో నుంచి ఖమ్మంపల్లి, ముత్తారం, మంథని, రామయ్యపల్లికి 4 బస్సులను ఏర్పాటు చేశారు. రోజు సమయానికి వచ్చే మంథని రూటుకు వెళ్లే బస్సు సాయంత్రం 5 గంటల వరకు వస్తుంటుంది. కానీ గురువారం సాయంత్రం రెండు గంటలు ఆలస్యంగా 7 గంటలకు వచ్చింది. బస్సు ఆలస్యం కావడంతో విద్యార్థులు భయాందోళన చెందారు. మోడల్ స్కూల్ దర్యాపూర్ గ్రామంలో అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉండడం, అసలే మండలంలో పులి సంచారంతో విద్యార్థులు బిక్కబిక్కుమంటూ గడిపారు. వారికి తోడుగా ఇద్దరు ఉపాధ్యాయులు, ఓ వాచ్‌మెన్ మెయిన్ గేట్‌కు తాళం వేసుకొని బస్సు వచ్చే వరకు స్కూల్ ఆవరణలో ఉన్నారు. పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పులి భయంతో కొందరు తల్లిదండ్రులు పిల్లలను బైక్‌లపై తీసుకవెళ్లారు. మోడల్ స్కూల్ వద్ద కనీసం బస్ షెల్టర్ గానీ, వీధి దీపాలు కూడా లేకపోవడంతో చీకటిమయంగా మారింది. స్కూల్ బస్సు పాడైపోయిందని, తెలిసి అదే సమయానికి మంథని డిపో అధికారులు వేరే బస్సును పంపిచకపోవడం ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోని సమయానికి బస్సులు నడపాలని కోరుతున్నారు.

కళ్యాణలక్ష్మి స్ఫూర్తిగా రూ.10వేల సాయం

- భామ్లునాయక్‌తండాలో నిరుపేద యువతికి మాజీ సర్పంచ్ భరోసా
- ఇప్పటివరకు 50 మందికి సాయం

దంపతులకు రూ.10వేలు అందిస్తున్న మాజీ సర్పంచ్ రాజునాయక్

పాలకుర్తి, మార్చి6: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన కల్యాణ లక్ష్మి స్ఫూర్తిగా పాలకుర్తి మండలం భామ్లు నాయక్‌తండాలో నిరుపేద యువతులకు గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌నేత, మాజీ సర్పంచ్ రాజునాయక్ అండగా నిలుస్తున్నారు. ఐదేండ్లుగా గ్రామంలో నిరుపేద యువతుల వివాహానిక ఆర్థిక సాయం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం భామ్లునాయక్ తండా పరిధిలోని రాజీవ్‌తండాకు చెందిన నిరుపేద యువతి లాస్యా ఆనందల వివాహానికి హాజరై రూ.10వేల నగదు అందించారు. తనను భామ్లునాయక్‌తండా మొదటిసర్పంచ్‌గా ఎన్నుకున్న ప్రజలకు అండగా నిలువాలన్న సంకల్పంతో, ఆడపిల్లల వివాహాలకు నిరాటంకంగా రూ.10వేల చొప్పున ఆర్థికసహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 50 మందికి సాయం చేసినట్లు తెలిపారు. ఇక్కడ తండా యువకులు తిరుపతి, మౌనిక, కిషన్, విజయ, రాజేష్, మౌనిక, సమ్మయ్య పాల్గొన్నారు.

సినీ హీరో చిరంజీవిని కలిసిన పుట్ట మధూకర్

మంథని, మార్చి 6: సినీ హీరో మెగాస్టార్ చిరంజీవిని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ హైటెక్స్ కన్వెన్షన్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కూతురు వివాహ వేడుకలకు చిరంజీవి హాజరయ్యారు. ఈ వివాహానికి పుట్ట మధూకర్ సైతం హాజరు కాగా చిరంజీవిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్‌తో మెగాస్టార్ చిరంజీవి ఎంతో సన్నిహితంగా ముచ్చటించారు. గతంలో పీఆర్పీ పార్టీలో పుట్ట మధూకర్ చిరంజీవితో కలిసి పని చేశారు.

ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, మార్చి6: హోలీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి – దానాపూర్, ముజఫర్‌పూర్ –చర్లపల్లి టెర్మినల్ మధ్య (10 ట్రిప్పులు) ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. ఈనెల 9, 19న చర్లపల్లి నుంచి దానాపూర్‌కు,11, 21న దానాపూర్ నుంచి చర్లపల్లికి, 10, 15, 20న చర్లపల్లి నుంచి ముజఫర్‌పూర్‌కు 12, 17,22న ముజఫర్‌పూర్ నుంచి చర్లపల్లికి ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. వీటికి కాజీపేట జంక్షన్, పెద్దపల్లి జంక్షన్, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్ నగర్ స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

10న అప్రెంటిస్ షిప్ మేళా

పెద్దపల్లి, మార్చి6: జిల్లాలో ఐటీఐ పూర్తి చేసుకున్న అభ్యర్థుల కోసం ఈనెల 10న పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్షిప్ మేళా నిర్వహించనున్నట్లు పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్/కన్వీనర్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తోషిబా, ఎల్ అండ్ టీ, జాన్సన్ లిఫ్ట్స్ ఇండియా, టాటా ఏరోస్పేస్, వరుణ్ మోటార్స్, ఆదర్శ మోటార్స్, రాణే ఇంజిన్ వాల్వ్స్ ,ఐటీసీ టెక్నాలజీస్ కంపెనీలు కరీంనగర్, హైదరాబాద్ నుంచి మేళాకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అప్రెంటిస్ షిప్ వెబ్‌సైట్ https:// www. apprenticeshipindia.gov.in/ నందు రిజిస్టర్ చేసుకోని,. సరైన ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు మొబైల్ నంబర్లు 9989616132, 9703 113881లను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పెద్దపల్లి, మార్చి6: నిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పని చేస్తున్న ఎల్ శంకరయ్యను సస్పెండ్ చేసినట్లు డీఈవో డీ మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడ్ మార్నింగ్‌కు బదులు జై భీమ్ అనాలని వేధిస్తున్న ఉపాధ్యాయుడు శంకరయ్యను సస్పెండ్ చేయాలని బుధవారం పాఠశాల ముందు విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేయగా, విచారణ చేపట్టి శంకరయ్యపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం జరిగిందని తెలిపారు.

పరీక్ష ప్రశాంతం

పెద్దపల్లి, మార్చి6: జిల్లాలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం మొదటి పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగిందని, 97.87 శాతం హాజరు నమోదైందని డీఐఈవో కల్పన తెలిపారు. సెకండ్ ఇయర్ తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షకు 4900 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 4796 మంది హాజరయ్యారని, 104 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ప్రభుత్వ దవాఖానలో న్యాణమైన వైద్య సేవలు

పెద్దపల్లి టౌన్, మార్చి 6: పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అన్ని రకాల న్యాణమైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన సంధ్య ప్రసవం కోసం దవాఖానలో చేరారు. ఆమెకు 74వేలు మాత్రమే ప్లేట్‌లెట్స్ ఉండడంతో డాక్టర్లు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం శస్త్ర చికిత్స చేశారు. అరుదైన సర్జరీ విజయవంతం చేసిన డాక్టర్ అనసూయ, డాక్టర్ రామం, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, బృందాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం దంత వైద్య దినోత్సవం సందర్భంగా దవాఖానలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఇక్కడ ఆర్‌ఎంఓ రవీందర్, వైద్యులు పాల్గొన్నారు.

అడవిలో మంటలు

అప్రమత్తమైన అల్ట్రాటెక్ సిబ్బంది

పాలకుర్తి, మార్చి6: బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం సమీపంలో ఈసాలతక్కళ్లపల్లి రిజర్వ్‌డ్ ఫారెస్ట్ ఏరియాలో ప్రమాదవశాత్తు అడవి అంటుకుంది. వారం రోజులుగా బుగ్గగుట్ట ప్రాంతంలో మంటలు వ్యాప్తిస్తున్నాయి. ఆకురాల్చేకాలం కావడంతో మంటలు గుట్ట చుట్టుపక్క దావానంలా వ్యాప్తిస్తున్నాయి. గురువారం ఉదయం అల్ట్రాటెక్ ఫైర్‌సేఫ్టీ బృందం అధికారులు, సిబ్బంది అప్రమత్తమై మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా ట్యాంకర్లు, ఫైర్ ఇంజిన్‌తో నీళ్లు తెచ్చి మంటలు ఆర్పివేశారు. సకాలంలో మంటలు ఆర్పిన అల్ట్రాటెక్ సిబ్బందిని అభినందించారు.

ఒంటరి తనం భరించలేక..

పెద్దపల్లి రూరల్, మార్చి6 : సబ్బితం గ్రామానికి చెందిన పెరుక రాయమల్లు(57) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాయమల్లు భార్య గత ఏడాది న్నర క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. రాయమల్లు దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా, వారికి వివాహాలు అయ్యా యి. రాయమల్లు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నాడు. భార్య ప్రమాదంలో మృతి చెందడం, ఇంట్లో ఎవరూ లేక ఒక్కడే ఉంటుండడంతో మనోవేదనకు గురయ్యాడు. రాయమల్లు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కూతుళ్లకు సమాచారం అందించి చికిత్స కోసం దవఖానకు తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. కూతురు గోలి సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అవమానంతో వృద్ధురాలు

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 6: గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన పల్లెర్ల యశోద(65) కాలనీలో జరిగిన గొడవతో అవమానం భరించలేక గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమేశ్‌కు చెందిన మాశెట్టి కళావతి, ఆమె కోడలు మాశెట్టి రమ్యశ్రీ ఇసుర్రాయి విషయంలో యశోదను దుర్భాషలాడారు. అనంతరం నెట్టివేయడంతో కిందపడిన యశోద ఏడ్చుకుంటూ ఇంటికివెళ్లింది. దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

37 లక్షల బీమా చెక్కు అందజేత

ఓదెల, మార్చి 6: హరిపురం గ్రామానికి చెందిన గ్యారవేన శ్రీనివాస్ ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పాలసీ ఉండడంతో ఆ కుటుంబానికి రూ. 37లక్షల చెక్కును కంపెనీ ప్రతినిధులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ఎక్స్‌క్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుండేటి మధు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

పెద్దపల్లి టౌన్, మార్చి 6: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న దొంగను పెద్దపల్లి పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 13 తులాల బంగారు ఆభరణాలు, రూ. 2. 25 లక్షల నగదు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ గురువారం రాత్రి ఏసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం కొయ్యూర్‌కు చెందిన బోరిగం సంపత్(35) పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లి గ్రామం లో మార్చి 2న మద్దెల కాంతమ్మ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. 9 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం కాల్వశ్రీరాంపూర్–తారుపల్లి క్రాస్‌రోడ్ వద్ద పారిపోతూ కనిపించడంతో సంపత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈక్రమంలో తాను చేసిన చోరీలను వివరించాడు. సంపత్ పల్సర్ బైక్‌పై మధ్యాహ్నం సమయంలో తాళాలు వేసిన ఇండ్లను టార్గెట్ చేసుకొని రాత్రి వేళ లేదా పగలు అనేక చోరీలు చేశాడని వివరించాడు. హైదరాబాద్, గోదావరిఖని, ధర్మారం, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, రామకృష్ణాపూర్, హసన్‌పర్తి, కొయ్యూర్, స్టేషన్‌ఘన్‌పూర్, ఏరియాల్లో 36 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇండ్లలోని సెల్‌ఫోన్స్, ల్యాప్‌ట్యాప్‌లు, డబ్బులు, బంగారు ఆభరణాలు అపహరించి అమ్ముకుంటూ విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడని తెలిపారు. ఓ చోరీ కేసులో ఇప్పటికే జైలుకు కూడా వెళ్లి వచ్చాడని తెలిపారు. దొంగ నుంచి పల్సర్ బైక్, 13 తులాల బంగారం, ఆభరణాలు, నగదు రూ. 2లక్షల 25వేలు స్వాధీ నం చేసుకునట్లు వివరించారు. దొంగను పట్టుకొవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐ వెంకటేశ్‌ను ప్రత్యేకంగా అభినందించి రి వార్డు అందజేశారు. ఇక్కడ సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, ఏఎస్ఐ తిరుపతి, కానిస్టేబుల్స్ ప్రభాకర్, అశోక్, సుమన్, రవీందర్, రమే శ్, రాజు, వినుస్తర్, రాజుకుమార్, ఫింగర్ ప్రింట్ బృందం పోలీసులను ఏసీపీ అభినందించారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

గోదావరిఖని: ఆర్జీ–1లో ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గోదావరిఖని, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ–1లోని జీఎం కాలనీ గోదావరి కళా ప్రాం గణంలో సింగరేణి ఆర్జీ–1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ అధ్యక్షతన మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 8న ఆర్‌సీవోఏ క్లబ్‌లో బహుమ తులు అందజేయనున్నారు. ఇక్కడ డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, సేవా జాయింట్ సెక్రటరీ బీనాసింగ్, సీనియర్ పీఓలు హన్మంతరావు, శ్రావణ్ కుమార్, స్పోర్ట్సు కో ఆర్డినేటర్ సంతోశ్‌రెడ్డి, తిరుపతి, సూపర్ వైజర్ రమేశ్ ఉన్నారు.

రామగిరి, మార్చి 6: ఆర్జీ–3 ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సేవా సభ్యులు, కాలనీ మహిళలకు స్థానిక రాణీ రుద్రమదేవి స్టేడియంలోని యోగా శిక్షణ కేంద్రంలో క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. ఆర్జీ–3 సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్ రావు పోటీలను ప్రారంభించారు. విజేతలకు ఈ నెల 8న జరిగే మహిళా దినోత్సవంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పీఎం సుదర్శనం, డిప్యూటీ పీఎం గుర్రం శ్రీహరి, సంక్షేమాధికారి ప్రీతి, సేవా కార్యదర్శి మల్లీశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, నిర్వాహకులు మహేందర్, సుధాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుకు సింగరేణి స్కూల్ విద్యార్థులు

గోదావరిఖని, మార్చి 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుకు సింగరేణి స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 9 సింగరేణి ఉన్నత పాఠశాలలో గోదావరిఖని లోని సెక్టార్ 2 హైస్కూల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల, మణుగూరులోని సింగరేణి ఉన్నత పాఠశాలలోని ఒకొక్క పాఠశాల నుంచి 2024–25కు గాను ఒక్కో విద్యార్థి ఎన్నికైనట్లు యాజమాన్యం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లభించే రూ. 10వేల ప్రోత్సాహంతో సైన్స్ ప్రాజెక్టును తయారు చేసి వర్కింగ్ మోడల్‌ను రాబోయే సంవత్సరంలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రదర్శించడానికి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అవార్డుకు కృషి చేసిన సైన్స్ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలను సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, ఆర్జీ–1 డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు అభినందించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి, మార్చి6: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని సూచించారు. ఆన్‌లైన్ లోన్ యాప్స్ జోలికి పోకుండా ఉండాలన్నారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని, మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేశ్, పెద్దపల్లి వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఐటీఐలో

సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా సైబర్ క్రైమ్ పోలీస్ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఐటీఐ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె కృష్ణమూర్తి క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్స్, మల్టీ లెవెల్ మార్కెటింగ్ ఫ్రాడ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. www.cybercrime.gov.in, సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 ప్రాముఖ్యతపై వివరించారు. సెల్ ఫోన్‌తో ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్లు వెంకటేశ్, కుమార్ పాల్గొన్నారు.

బీ జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

రామగిరి, మార్చి 6: మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం బీ జోన్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కళాశాల ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన 12 టీంలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. పీడీ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్, ఏఈఈ ప్రభాకర్, కాంట్రాక్టర్ శ్రావణ్, పీడీ సునీల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మారుపేర్ల సమస్యను పరిష్కరించండి

గోదావరిఖని, మార్చి 6: సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్య పరిష్కారం లేక తమ ప్రాణాలు పోతున్నాయని, ఇప్పటికైన తమ సమస్యను పరిష్కరించాలని మారుపేర్ల విజిలెన్స్ బాధితులు పేర్కొన్నారు. కంపెనీలో ఉద్యోగం కోసం మారుపేర్ల బాధితుడు ఆదినారాయణ తిరుగుతున్న క్రమంలో ప్రమాదానికి గురై కాలు విరిగి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు గురువారం తోటి బాధితులు ఆదినారాయణను పరామర్శించి మాట్లాడారు. నాటి కాలంలో చదువు లేకపోవడంతో జరిగిన తప్పులకు మమ్మల్ని శిక్షించొద్దని, ఇప్పటికే బాధితుల్లో ఇద్దరు చనిపోయారన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముత్తారం, మార్చి 6; పులి ఆచూకీ దొరికే దాకా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో శివయ్య తెలిపారు. ఐదు రోజులుగా పులి మండలంలో సంచరిస్తున్న విషయం లిసిందే. దాని ఆచూకి కోసం ఫారెస్టు అధికారులు అటవీ ప్రాంతంలో జల్లెడ పడుతున్నారు. గురువారం జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య బహుగుళ్ల ప్రాంతంలో తన సిబ్బందితో కలిసి అన్వేషించారు. పులి ఆనవాళ్లు ఇంకా లభించలేదని తెలిపారు. పశువుల కాపరులు, అటవీ శివారు ప్రాంత రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.